గిట్ల ఉన్నయా? అన్న అనుమానం వచ్చి.. లేచి చేతికర్ర, టార్చిలైటు తీసుకుని చేనువైపు పోయిండు. పత్తిచేను దగ్గరకి వచ్చి టార్చిలైట్ వేసి చుట్టూ చూసిండు. దూరంగా ట్రాన్స్‌ఫార్మర్ చప్పుడు.. గుయ్యిమంటూ వినిపిస్తుంది. అంటే కరెంట్ ఉందని అర్థం. కోతుల జాడ కనపడకపోయే సరికి.. ఇంటికి పోదాం అనుకున్నడు. అంతలోనే చిన్నగా కోతి పిల్లల కేకలు వినిపించాయి. చీకట్లో చేను చుట్టూ టార్చిలైట్ వేసి చూశాడు. దూరంగా ఎక్కడో కోతుల మంద. చీకట్లో టార్చిలైట్ కాంతికి.. వరుసగా మెరుస్తున్న తెల్లని కళ్లు. కోతుల మంద దగ్గరికి వస్తున్నది. ముందుగాల వాటికి నాయకుడిలా నడిపించిన కోతి.. దగ్గరగా వచ్చి ఫెన్సింగ్‌ను అనుమానంగా పట్టుకుంది. షాక్ కొట్టగానే వెనక్కు జరిగి మిగిలిన కోతులను.. 'పోవద్దు!' అన్నట్లు గట్టిగా అరుస్తున్నది. కానీ, అంతలోనే రెండు పిల్ల కోతులు ఫెన్సింగ్ పైకి ఎక్కాయి. కరెంట్ షాక్ తగిలి గిలాగిలా కొట్టుకుంటున్నాయి. మిగిలిన కోతులు వాటిని లాగడానికి దగ్గరికి పోయి.. షాక్ తగిలి మొత్తుకుంటున్నాయి. నలభై యాభై కోతులు.. కిచ..కిచ.. అంటూ ఒకటే గోల! ఇంకొద్దిసేపు అలాగే ఉంటే.. ఆ రెండు పిల్లకోతులే కాదు. పదైనా పెద్ద కోతులు చనిపోతాయి. కానీ, మనసు ఒప్పుకోలేదు ఎంకన్నకు. గబగబ పరిగెత్తి.. కరెంటు కనెక్షన్ పీకేశాడు. భయంతో కోతులు అక్కడి నుంచి పరిగెత్తాయి. మనసు ఎలాగో అనిపించి అక్కడే కూలబడ్డాడు. అడవి పందులు, జింకలు చివరకు పులిని ఐనా ఎదుర్కోవచ్చు కానీ.. ఈ కోతులను ఎలా ఎదుర్కోవాలో అర్థం కాలేదు. దూరంగా గుట్టల్లో బాంబు పేలిన శబ్దం. డ్యాం కట్టడం కోసం.. కొండను బాంబులు పెట్టి పేలుస్తున్నారు. ఆ ప్రాజెక్టు కట్టడం అయిపోతే.. తమ ఊరు పొలాలన్నింటికి నీళ్లు వస్తాయని.. తమ భూముల ధరలు పెరుగుతాయని జనాలు అనుకుంటున్నారు. భూముల ధర సంగతి ఏమో కానీ.. పంటలు ఎలా కాపాడుకోవాలో అర్థం కాలేదు ఎంకన్నకు. అక్కడే చేను పక్కన ఉన్న బండమీద పడుకుని తెల్లవారు గట్ల ఇంటి బాటపట్టాడు.

ఊరి రచ్చబండ దగ్గర రావి చెట్టు కింద కూచొని కోతుల గురించే మాట్లాడుకుంటున్నరు.

''ఒకప్పుడు ఊరు ఎట్ల ఉంటుండే! ఎటు చూసినా పచ్చని చెట్లు. ఎండకాలం మామిడి పండ్లు, సీమసింత పండ్లు, తునికి చెట్లు, వానకాలం వస్తే ఎటుచూసిన పచ్చని చిగుళ్లు, చింతచెట్ల వానగాయలు, నేరేడు చెట్లు, తాటిపండ్లు.. చలికాలం నారింజ పండ్లు, సీతాఫలం చెట్లు, సంక్రాంతి సమయానికి ఇరగకాసిన రేగుపండ్లు..



మళ్లీ ప్రాజెక్టు బాంబు పేలుడు శబ్దం ఊరంతా ప్రతిధ్వనించింది. ఇంటి గోడలు, ఇంట్లో ఉన్న వంటపాత్రలు ఉలిక్కిపడ్డట్టుగా కదిలాయి. గుంజకు కట్టేసిన ఆవు.. భయంతో అటు ఇటూ తిరుగుతున్నది. బాంబు పేలుళ్లు.. పెద్దపెద్ద పొక్లెయినర్ల శబ్దాలు.. ఇరవై నాలుగ్గంటలూ రోడ్ల మీద టిప్పర్లు.. వీటన్నిటిని చూస్తే.. ప్రాజెక్టు వచ్చాక భూముల ధరలు పెరగడం ఏమో కానీ.. ఊరంతా విధ్వంసం అవుతున్నదన్న భయం కలిగింది ఎంకన్నకు. పెద్దపెద్ద ప్రాజెక్టులతోని మనుషులు బతుకుతరేమో కానీ.. కోతులతో సహా అన్ని జీవరాశులు, కొండలు, గుట్టలూ అన్నీ విధ్వంసం అవుతున్నట్టు కళ్లముందు కనపడుతున్నది.

ఇంగ జామకాయలు మూడు కాలాలూ కాసేటియి. అడవి జీవరాసుల ఆకలి తీరుతుండె. ఇప్పుడు రియల్ ఎస్టేట్ పేరుతోని భూమిని నాశనం చేస్తిరి. జీవరాసులు ఎట్ల బతకాలె. అడవిలే ఏం దొరుకుతుంది తినడానికి!''.. అని టీచర్‌గా పనిచేసి రిటైరైన ధర్మయ్య సార్ ఇవరం చెప్పబట్టే.

''మరి ఇప్పుడు కోతుల గోల వదిలించుకోవాలంటే ఎట్ల సారూ!'' అని అడిగిండు ఎంకన్న.

''వదిలించుకోవడం ఎట్ల కుదురుతది? ఈ భూమి మన ఒక్కరిదే కాదు కద. అన్ని జీవరాశులది కద! అట్లనే కోతులది కూడా. కాబట్టి వాటిని వదిలించుకోవడం కుదరదు. వాటితోని కలిసి బతకాల్సిందే''..

''కోతులు, మనుషులు ఎట్ల కలిసి బతుకుతరు''.. అర్థం కాలేదు ఎంకన్నకు.

''ఎందుకు బతకలేము. మన తాతలు, ముత్తాతలు అట్లనే కద బతికింది. కుక్కలు, పిల్లులు, పందులు, పాములు, కోతులు అందరు కలిసి బతకలేదా! ఎవల బతుకు వాళ్లు బతికితే ఈ భూమి మీద ఎవరికి ఇబ్బంది లేదు''.

''ఇంతకూ ఇప్పుడు ఏం చేద్దాం అంటరు సారూ'' అని అడిగిండు ఎంకన్న.

''మన ఊరంతా తల ఇంత ఏసుకుని అరటిపండ్లు.. బత్తాయిలు.. ఇంట్ల ఏది చౌకగ దొరికితే అవి తెచ్చి.. ఊరిబయట ఒక తావుల పెట్టాలె. అట్ల ఒక వారం పాటు అలవాటైతే.. కోతులు రోజూ తిండికి అక్కడికే వస్తయి. అట్లనే తొందరగా పండ్లు వచ్చేటి.. సీతాఫలం చెట్లు, జామ చెట్లు ఊరిబయట బంజరు భూముల్ల.. రోడు పక్కన నాటించాలె. అట్ల వాటికి తిండి అడవిలనే దొరికితే ఊరి మీదికి రావు కద. అట్ల ఏ ఊరు కోతులు ఆ ఊళ్లోనే ఉంటే.. సమస్యే ఉండదు కద!''..

ధర్మయ్య సార్ చెప్పింది ఏదో మంచిగనే ఉందనిపించిది ఎంకన్నకు.

ఇంతలో మళ్లీ ప్రాజెక్టు బాంబు పేలుడు శబ్దం ఊరంతా ప్రతిధ్వనించింది. ఇంటి గోడలు, ఇంట్లో ఉన్న వంటపాత్రలు ఉలిక్కిపడ్డట్టుగా కదిలాయి. గుంజకు కట్టేసిన ఆవు.. భయంతో అటు ఇటూ తిరుగుతున్నది. బాంబు పేలుళ్లు.. పెద్దపెద్ద పొక్లెయినర్ల శబ్దాలు.. ఇరవై నాలుగ్గంటలూ రోడ్లమీద టిప్పర్లు.. వీటన్నిటిని చూస్తే.. ప్రాజెక్టు వచ్చాక భూముల ధరలు పెరగడం ఏమో కానీ.. ఊరంతా విధ్వంసం అవుతున్నదన్న భయం కలిగింది ఎంకన్నకు. పెద్దపెద్ద ప్రాజెక్టులతోని మనుషులు బతుకుతరేమో కానీ.. కోతులతోసహా అన్ని జీవరాశులు, కొండలు, గుట్టలూ అన్నీ విధ్వంసం అవుతున్నట్టు కళ్లముందు కనపడుతున్నది.

* * *

ఆరోజు పొద్దున్నే ధర్మయ్య సార్ పేపర్ పట్టుకుని అందరికీ చదివి వినిపిస్తున్నాడు. అది పిడుగు లాంటి వార్త అని జనానికి అర్థమైంది. తమ ఊరు దగ్గరలో కడుతున్న ప్రాజెక్టు ఎత్తు ఇంకా పెంచాలని ప్రభుత్వం నిర్ణయించిందట. ఎత్తు పెంచడం వలన నీళ్ల ముంపు ప్రాంతం ఎక్కువగా ఉంటుందని.. అందుకే తమ ఊరితోపాటు ఇంకా రెండు గ్రామాలను ఖాళీ చేసి.. తరలిస్తామని ప్రభుత్వం ప్రకటించిందంట.

తరతరాలుగా ఉన్న ఊరు. పుట్టి పెరిగిన ఊరు. అన్నీ వదిలేసి ఇంకో తావుకు పోయి బతకాలె అంటే అయితదా!? గవుర్మెంటు డబ్బులు ఇవ్వొచ్చు. కానీ, డబ్బులు ఎంతకాలం ఉంటయి. ఎంకన్నలో కనపడని ఆందోళన మొదలైంది. ఆ రాత్రి మొత్తం నిద్రపట్టలేదు. తెల్లవారుజామున ఎప్పుడో చిన్న కునుకు.. ఇంతలో మళ్లీ ఒక్కసారిగా రేకుల మీద చప్పుడు.. కాకపోతే ఇప్పుడు కోతులు కాదు.. మనుషులు! తను, తన భార్య, పిల్లలు, తన ఊరివాళ్లు.. ఆ రేకుల మీద, ఇండ్ల మీద దూకుతూ పరిగెడుతున్నారు. ప్రశాంతంగా బతకడానికి ఇంత తావు కోసం..

'అమ్మా.. నాన్నా!'' అంటూ పిల్లల ఆర్తనాదాలు.. పరిగెడుతున్నారు.. దూకుతున్నారు.

''కోతులు.. గుంపులు.. మనుషులు.. తావులు.. విధ్వంసం.. కోతులు.. బిడ్డా.. జాగ్రత్త..'' అంటూ గట్టి గట్టిగా అరుస్తూ, కేకలు పెడుతూ ఊరిలోని వీధుల్లో ఉరుకుతున్నాడు ఎంకన్న. ■

## చందు తులసి



**చందు** తులసి అసలుపేరు చంద్రశేఖర్. సూర్యాపేట సమీపంలోని బండమీద చందుపట్ల స్వగ్రామం. హైదరాబాద్‌లో ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు. జీవిత సహచరి తులసి పేరుతో కలిపి 'చందు తులసి' కలం పేరుతో కథలు రాస్తుంటారు. ఈయన రాసిన మొదటి కథ.. 'ఊరవతల ఊడలమర్రి' మంచి గుర్తింపు తెచ్చింది. నమస్తే తెలంగాణ ఆదివారం అనుబంధం 'బతుకమ్మ'లో వచ్చిన 'పాలపిట్టల పాట' కథ.. నేషనల్ బుక్ ట్రస్ట్ కథా సంకలనానికి ఎంపిక కావడమే కాకుండా.. ఇతర భారతీయ భాషల్లోకీ అనువాదమైంది. తల్లిగారిల్లు, నీళ్లబిందె, బతుకమ్మ పుట్టింది లాంటి కథలు పలు గుర్తింపు పొందిన కథా సంకలనాలకు ఎంపికయ్యాయి. సినిమారంగంలోనూ రచయితగా పనిచేస్తున్నారు. గతంలో గడి, తక్కెడ, మోదుగు పువ్వు, కాటుక పూల బతుకమ్మ.. కథలకు నమస్తే తెలంగాణ – ముల్కనూరు సాహితీపీఠం కథల పోటీల్లో బహుమతులు అందుకున్నారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు, మహిళల జీవితాలను ప్రధాన ఇతివృత్తాలుగా తీసుకుని కథలు రాస్తుంటారు.